# లవ్ బైట్

మంత్రివాది మహేశ్వర్

ప్రవీణ చనిపోయింది.

ఆత్మహత్య చేసుకుందిట-

మిత్రుడు కుమార్ వచ్చి చెప్పగానే నమ్మలేకపోయాను. ఆ వార్త నన్ను నిశ్చేష్టుణ్ణి చేసింది.

ఇలా జరుగుతుందని నేను ఊహించలేదు. అలాగైతే నేను పందెం కాసేవాడినే కాను. ఒక స్వల్ప విషయంగా కాలేజీ కాంటీన్‌లో ప్రారంభమైంది. మూడు నెలలవుతుందేమో-

** ** **

"ప్రవీణ అదిగో..."

"అవునురా భలే నడుస్తుందిరా."

"ఎంత అందంగా ఉంది !"

"అందమంతా ఆమెకే ఇచ్చి ఆ భగవంతుడు మిగిలిన ఆడవాళ్ళకు అన్యాయం చేశాడేమో అనిపిస్తుందిరా."

"ఎవరికి అన్యాయం చేశాడో నేను చెప్పనా... మన సుప్రీత... పొట్టి జడకి."

అంత నవ్వారు.

"ప్రవీణ ఎవరితోనూ మాట్లాడదు. అహంకారమంటావా?" మరొకరు.

"అంత వెర్రివెంగళప్పల్లా నోరు తెరిచి ఆమెకేసి చూడాల్సిందే గానీ ఆమెతో కలిసి తిరగడం ఎవరివల్లా కాదు." విష్ణు.

"మన ప్రదీప్ వల్ల అవుతుందనుకుంటాను." కుమార్.

"ప్రదీప్‌వల్లా?" గట్టిగా నవ్వాడు బాలాజీ.

నాకు కోపం వచ్చింది.

ఆ విషయం వాళ్ళకూ తెలిసింది.

ఇంకా ఏవేవో మాట లనడం మొదలెట్టారు.

నాలో పౌరుషం హెచ్చింది... "సరే" అని. ఒప్పుకుంటూ పందెం కాశాను.

"రెండు మాసాల్లో ప్రవీణని నా దారికి తెచ్చుకోగలగాలి. అలా చేస్తే వెయ్యి రూపాయలు అంతా కలిసి నా కివ్వాలి. లేనిపక్షంలో ఫ్రెండ్స్ అయిదుగురికీ ఓ పెద్ద డ్రింక్ పార్టీ అరేంజ్ చేయాలి."

చేతులు కలిపాను ఛాలెంజింగ్‌గా.

నాకు ప్రవీణ సంగతి తెలును. మా మిత్రబృందం సంగతి వేరు, నా సంగతి వేరు. నే నంటే ప్రవీణకి సదభిప్రాయమే ఉంది. వెకిలి వేషాలు వేయననీ, కామ్‌గా ఉంటాననీ ప్రవీణకు తెలును. నేను ఒంటరిగా కనిపించినప్పుడు తను చూసినప్పుడు నవ్వేది. ఆ ధైర్యంతో ఆమె ద్వారా పందెం గెలవడం ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నాను.

ఒక నెల రోజుల్లో-

"హలో" అనే పలకరింపులు, చూసి నవ్వుకోవడం, కాఫీకి కలిసి వెళ్ళడం జరిగిపోయాయి.

కాలేజీ దినోత్సవం రావడం - మే మిద్దరం నృత్య సంగీత కార్యక్రమంలోపాల్గొనడం జరిగింది. ఆమె అభినయానికి నా పాట ఎంతో బావుందని మెచ్చుకున్నా రంత. దాంతో మా పరిచయం మరీ మరీ పెరిగింది.

ఎంతో సిగ్గుపడుతూ నడిచి వెళ్ళే ప్రవీణే ఈ ప్రవీణ అన్నంత నాకు బాగా దగ్గరైంది. ఎప్పుడూ కలిసే తిరుగుతుండే వాళ్ళం.

ఆదివారం వచ్చినా, సెలవు రోజు వచ్చినా ఏదో ఒక సమయంలో కాసేపయినా కలిసుండే వాళ్ళం.

ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళు చూసుకుంటూ ఉంటే కాలం తెలిసేది కాదు.

'అంత అందం నాకు చేరువైందా' అనిపించింది.

రెండో నెల చివరికొచ్చింది. పందెం గుర్తొచ్చింది. నాదే విజయం అన్న ధైర్యం - ఒక మూల.

ప్రవీణ నాతో ఎన్నో విషయాలు మాట్లాడింది. నన్ను చాలా దగ్గ రనుకుంది. భవిష్యత్తు గురించి సౌధాలు నిర్మించేటప్పుడు - ఆమె పెదాలపై చిర్నవ్వు, కళ్ళలో మెరుపు.

పందెం గడువు తేదీ రానే వచ్చింది.

ఆ రోజు మా పేరెంట్స్‌ని కలవడానికని ప్రవీణని రమ్మని ఆహ్వానించాను. వెంటనే ఒప్పుకుంది.

నేను అలా అడగడం ఎలా అనిపించినా ఆమె సందేహించలేదు.

ప్రవీణను రమ్మని ఇచ్చిన చిరునామా నాది కాదు - నా మిత్రబృందానిది.

సాయంకాలం అయిదింటికి అంతా అక్కడే ఉన్నారు. నేను నిలబడి ప్రవీణ రాకకోసం వెయిట్ చేస్తున్నాను. ప్రవీణ ఇంకా రాలేదు. ఆమె రాకపోతే పందెం మాట? భయమేసింది.

ప్రవీణ వచ్చేసరికి ఆరైంది.

చాలా అందంగా - లైట్ క్రీమ్‌కలర్ శారీ, అదే రంగు బ్లౌజులో - మెరుపు తీగెలా ఉంది.

"ఆ అలంకరణే ఆలస్యానికి కారణమా?" అన్నాను.

నవ్వింది ప్రవీణ.. ఆ నవ్వులో వెలుగు.

అంతమందిని అక్కడ చూసేసరికి అదోలా ఫీలయింది ప్రవీణ.

అందరూ అరుపులు... కూతలు...

చూసి చెవులు మూసుకుంటూ స్థాణువై నిలబడిపోయి ఉంది ప్రవీణ.

నేను కామ్‌గా ఉండిపోయాను.

ఈ క్షణం కోసం రెండు మాసాల పాటు కష్టపడ్డాను. ఇప్పుడు నేను హీరోను. 'చీర్స్' అంటూ కేకలు. విజయధ్వనులు...

"ఏమిటి ప్రదీప్? మీ పేరెంట్స్ అన్నావు ఎక్కడ?" అంత గోలలోనూ ఆమె మాటలు సున్నితంగా నా చెవిని తాకాయి.

నేను విషయం వివరించి చెబుదా మనుకుంటూంటే - బృందంలోంచి ఒకడు లేచి చెప్పడం ప్రారంభించాడు.

"చూడండి మిస్... మీ రెంతో అందగత్తె అనే అహంకారం ఎవరితోనైనా మాట్లాడితే ఆస్తి తరిగిపోతుందనే భయం తగ్గించడానికి మా ప్రదీప్ సారీ హీరో ప్రదీప్ మీతో ఆడుకున్నాడు. అవును గదరా బ్రదర్స్?"

వినగానే కళ్ళనుంచి జారిన నీటిబొట్లు బుగ్గల మీదకు జారాయి.

"నిజమా? చెప్పు ప్రదీప్... చెప్పు." వణికిపోతూ అడిగింది.

అవునన్నట్లు తలాడించాను మిత్రబృందం కేసి చూస్తూ.

ప్రవీణ తన ముఖాన్ని అరచేతుల్లో దాచుకుంది బాధతోనో, సిగ్గుతోనో...

"ప్రదీప్... ఎంత మోసం చేశావు? నువ్వు నిజంగా ప్రేమిస్తున్నా వనుకున్నాను.",

నే నింకా ఏమైనా చెబుతా ననుకుంది. మాట్లాడలేకపోయాను.

క్షణం నిశబ్దం తరువాత - ఆమె పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది అక్కణ్ణుంచి.

ప్రవీణ అంత సీరియస్‌గా తీసుకుంటుం దనుకోలేదు ఏమిటో !

నేను వెళ్ళి ఆమెను కలవడానికి, విషయం చెప్పి క్షమాపణ కోరడానికి కొంత ఆలస్యమైపోయింది. అప్పటికే ఆమె ఆటోలో వెళ్ళిపోయింది.

ఆ రాత్రే మిత్రబృందం పార్టీ ఏర్పాటు చేసింది.

పైకి నవ్వుతున్నా లోపల బాధగానే ఉంది నాకు. ప్రవీణ హృదయం ముక్కలు చేశాననే బాధ. పందెం గెలుపు మీద ధ్యాసలేదు.

** ** **

కాలేజీలో ప్రవీణకోసం చూశాను - క్షమాపణలు చెప్పాలని. తెలియక చేసిన తప్పుని - నిజంగా మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాననీ, పెళ్ళి చేసుకుంటాననీ.

ఆమెతో చేసిన బాసలు వినిపిస్తున్నాయి. కలిసి తిరిగిన క్షణాలు గుర్తొస్తున్నాయి.


మనసంతా అలజడితో నిండిపోయింది. ఆమె, కాలేజీకి రాకపోవడంతో మూడవ రోజున ఇంటి దగ్గరే కలవాలని నిర్ణయించుకున్నాను.

## ముద్దు

పండుగకు అత్తారింటికి వచ్చిన అల్లుడు తన మరదలుతో "ఒక 'ముద్దిస్తావా?" అని అడిగాడు.

"ఒక్క టేం బావా రెండు తీసుకో. నేను బయటికెళ్ళేటప్పుడు అక్క కిచ్చెళ్ళా. అక్క దగ్గర తీసుకో" చెప్పింది గడసరి మరదలు.

విజయశ్రీ [గోనెగండ్ల]



చేసిన తప్పుకి కాళ్ళమీద పడైనా క్షమాపణలు అడగాలి. ఆమె పెదాలపై మళ్ళీ చిరునవ్వు వెలగాలి - అనుకున్నాను.

కానీ...

కానీ... కుమార్ ఆ వార్త తీసుకొస్తాడని ఊహించలేదు. బుల్లెట్ దెబ్బ తిన్నట్లయింది.

ప్రవీణ చనిపోయింది... ఆత్మహత్య చేసుకుంది.

"నువ్వే హంతకుడివి !" అని అంతా అంటున్నట్లు అనిపించింది.

గదిలో గుండె వగిలేలా ఏడ్చాను. తల గోడకేసి బాదుకున్నాను.

నీళ్ళు నిండిన ఆమె కళ్ళు - రాత్రీ పగలూ కనిపిస్తూనే ఉన్నాయి.

'నువ్వు నన్ను ప్రేమిస్తున్నా వనుకున్నాను' అన్న ఆమె చివరి మాటలు వినిపిస్తునే ఉన్నాయి.

"నిజం ప్రవీణా ! నిన్ను ప్రేమిస్తున్నాను. నటన కాదు. నిన్ను బాధపెట్టాలని పెట్టలేదు... ప్రవీణా... ప్రవీణా..."

గుండె పగిలి ముక్కలయ్యేలా అరుస్తునే ఉన్నాను. కానీ ప్రవీణకు ఎలా వినిపిస్తుంది?

అందుకే గట్టిగా అరుస్తునే ఉన్నాను ఆమెకు వినిపించాలని.

బయట జోరుగా కురుస్తోంది వర్షం.

'ప్రవీణ... ప్రవీణ... ప్రవీణ...'

ఆ వర్షంలో అరుస్తూ పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాను. మరి నా కళ్ళకు ఆమె తప్పితే ఏం కనిపించటంలేదు.